క్లుప్తంగా

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న ముస్లింలు

కోటవురట్ల: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు శుక్రవారం నిరసన తెలిపారు. స్థానిక మసీద్ వద్ద నమాజ్ అనంతరం ప్లకార్డులతో నినాదాలు చేశారు. మక్కా మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాసిం మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడం దారుణమన్నారు. నిర్ణయం మార్చుకుని రాష్ట్రంలో అమలు చేయకుండా తీర్మానం ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



రక్షితనీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస

మునగపాక: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస పేర్కొన్నారు. మండలంలోని మూలపేట శివారు గంగాదేవిపేట గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన 20 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన రక్షితనీటి పథకాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంగాదేవిపేటలో నూతనంగా నిర్మించిన రక్షితనీటి పథకాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చి ఇంటింటికీ కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, వార్డు సభ్యులు కేవీఏ నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు స్థానికంగా పరిష్కరించుకోవాలి



అర్జీదారుల సమస్యలు వింటున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం మండల కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఇరువర్గాల వారు శాంతియుతంగా సమస్య పరిష్కారమయ్యేలా సహకరించుకోవాలన్నారు. వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ పి.ప్రసాదరావు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, వీఆర్వో సత్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ పన్ను చెల్లింపు గడువు పెంపు

యలమంచిలి రూరల్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి బకాయి పడిన ఆస్తి పన్ను చెల్లింపునకు 50 శాతం వడ్డీ రాయితీ వర్తింపు గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. అదేవిధంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారంతా ఈ నెల 30వ తేదీలోగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్క్రాప్ దుకాణంలో మృతదేహం



పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలోని ఓ స్క్రాప్ దుకాణంలో గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. హెచ్‌సీ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇక్కడి స్క్రాప్ దుకాణంలో సుమారు 60–70 వయసు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 94407 96039, 99085 58866 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన



డీటీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నక్కపల్లి: మండలంలో చందనాడ, తమ్మయ్యపేట, పాటిమీద, బోయపాడు, రాజయ్యపేట తదితర గ్రామాల్లో బల్క్ డ్రగ్ పార్క్ కోసం సేకరించిన ప్రభుత్వ స్థలాల్లో కొంతమంది ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని, వీరికి కూడా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, రైతు సంఘ నాయకుడు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వాసితులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వీసం మాట్లాడుతూ స్థలాలతోపాటు, ఇళ్లను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇటీవల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం విడుదల చేసిన జాబితాలో వీరి పేర్లు లేవన్నారు. నిరాశ్రయులవుతున్న వీరిని జాబితాలో చేర్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, ఇంట్లో మేజర్లకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ మేరకు డీటీకి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, రైతు నాయకుడు తళ్ల అప్పలస్వామి పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ



వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: వ్యవసాయ రంగంలో స్థూల అదనపు విలువ పెంపు కోసం రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత వ్యవసాయాధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన రైతులకు రూ.5 లక్షలు విలువైన రోటోవేటర్లు, దమ్ము సెట్లు, దుక్కి సెట్లు, పవర్ టిల్లర్లు, పవర్ స్ప్రేయర్లు బ్రష్ కట్టర్లు తదితర ఆధునిక వ్యవసాయ పనిముట్లను రాయితీపై పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాదించే దిశగా రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు

యలమంచిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న డీఎస్సీకి హాజరుకానున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కులాల అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు యలమంచిలి సహాయ వెనుకబడిన తరగతుల అధికారి జి. నాగేశ్వర్రావు తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థుల బయోడేటాతో పాటు పదో తరగతి, టీటీసీ లేదా బీఈడీ, టెట్ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ నకలు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేసి యలమంచిలిలోని తమ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. వివరాలకు 8008341060, 9885845743 సంప్రదించాలన్నారు.

ఘనంగా తలుపులమ్మ ఆలయ ప్రారంభోత్సవం



తలుపులమ్మతల్లిని దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తులు

యలమంచిలి రూరల్: మండలంలోని షేక్‌ిళ్లపాలెం శివారులో వెలిసిన తలుపులమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలి రోజు గణపతి హోమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.ఈ నెల 13వ తేదీ ఉదయం 8.24 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించనున్న ఈ కార్యక్రమం అనంతరం చిడతల భజనలు, నేలవేషాలు, కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చనున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

14 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా

పాయకరావుపేట: మండలంలో వెంకటనగరం, రాజానగరం గ్రామాల్లో దాడులు నిర్వహించి 14 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.ఎల్. ప్రశాంతి, హెచ్‌సి కె.నాయుడు, ఆర్.జగన్నాథం పాల్గొన్నారు.

కూటమి పాలనలో పేదలకు కష్టాలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు

పాయకరావుపేట: సంక్షేమ పథకాలు అమలు చేయని కూటమి పాలనలో పేదలు అష్టకష్టాలు పడుతున్నారని జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. ఎస్సీలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తానని చెబుతూనే మరోవైపు సర్వీసు చార్జీలు పేరుతో బిల్లులు పెంచుతున్నారని దుయ్యబట్టారు. అమ్మకు వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ఆటోలకు, కుల వృత్తుల వారికి పథకాలు అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములై గ్యాస్ ధర పెంచారన్నారు. సంపద సృష్టిస్తానని ఆచరణలో చూపడం లేదని విమర్శించారు. పేదలను నట్టేట ముంచుతున్నారన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ చేసి గెలిచిన కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు, కక్ష సాధింపు చర్యలు మానుకొని, పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మంచి పాలన అందించాలని హితవు పలికారు. ఇప్పటికైనా పునరాలోచించి పెంచిన సర్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు గార చక్రవర్తి, టి.చంటిబాబు, పి.రాంబాబు, కాకాడ కృష్ణ, ఎన్.అప్పారావు, దండా లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెదఉప్పలంలో అన్న సమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఎస్.రాయవరం: పెదఉప్పలం సీతారామాలయంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామనవమి పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత పట్టాభిరాముని విగ్రహాలకు వెండి వస్త్రాలు అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ, నాయకులు శిగటాపు జోగిరాజు, వీర్ల సూర్యప్రకాష్, వీర్ల గోవిందు, గణేష్, పాలపర్తి శ్రీనివాసరావు సహాయ సహకారాలు అందించారు.

ప్రజలపై స్మార్ట్ మీటర్ల భారం వేయొద్దు



బుచ్చెయ్యపేటలో గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చెయ్యపేట: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని జిల్లా సీపీఎం కమిటీ సభ్యుడు వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ శుక్రవారం బుచ్చెయ్యపేటలో గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. ఎన్నికలు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని, నాణ్యమైన కరెంట్ అందిస్తామని చెప్పి, ఇప్పుడు గద్దె నెక్కిన తరవాత కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతోందన్నారు. అదానీలాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూరేలా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ట్రూ అప్ సర్ చార్జీలు పేరుతో రూ.15 వేల కోట్లు పేద ప్రజలపై భారం వేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రతి ఒక్కరికీ మరో రూ.10 వేలు భారం వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటు సంస్థలకు అప్పగించి ప్రభుత్వం రైతులకు, ప్రజలకు అందిస్తున్న రాయితీలు తీసేయాలని ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాంబశివరావు, నాయుడు, శ్రీను, రాజు, రమణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థిని అదృశ్యం

నర్సీపట్నం: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఈ నెల 6వ తేదీ నుంచి కనిపించడం లేదు. బాలిక ప్రవర్తన విషయమై ఇటీవలే వసతి గృహానికి వచ్చిన ఆమె తల్లి మందలించింది. ఈ నేపథ్యంలో బాలిక వసతి గృహం నుంచి వెళ్లిపోయినట్లు వసతిగృహం నిర్వాహకులు, పోలీసులు అనుమానిస్తున్నారు. బాలిక అదృశ్యంపై వసతిగృహం వార్డెన్ రాజ్యలక్ష్మి సోమవారమే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా చెట్ల నరికివేతపై రగడ

- కూటమి నేతల అండతో సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల దందా
- ఆయకట్టు రైతులు, గ్రామస్తులతో కలిసి అడ్డుకున్న పంచాయతీ సభ్యులు
- నరికిన చెట్ల విలువ రూ.20 లక్షలు?



సూరపురాజు చెరువులో నరికేసిన నేరేడు చెట్లు



యూకలిప్టస్ తోటలో రైతులు, సాగునీటి సంఘం, పంచాయతీ సభ్యులు

సబ్బవరం: మండలంలోని గొటివాడ రెవెన్యూ పరిధి సూరపురాజు చెరువులో పెద్దఎత్తున నేరేడు, యూకలిప్టస్ చెట్లను నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. రెండు వారాలుగా జరుగుతున్న ఈ వ్యవహారాన్ని గుర్తించిన గ్రామస్తులు, ఆయకట్టు రైతులతో కలిసి సాగు నీటి సంఘం, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గొటివాడ రెవెన్యూ పరిధి సర్వే నెం.16లో 42.32 ఎకరాల సూరపురాజు చెరువు ఉంది. ఈ చెరువుకు గొటివాడ గ్రామంతో పాటు శివారు గ్రామాలైన బొండవానిపాలెం, సాలాపువానిపాలేనికి చెందిన 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. మండలంలోనే రెండో అతిపెద్ద చెరువు. దీని చుట్టూ 30 ఏళ్ల వయసు పైబడిన భారీ నేరేడు చెట్లు, సుమారు 6 ఎకరాల వరకూ యూకలిప్టస్ తోట ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. కూటమికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబు, ఉపాధ్యక్షుడు బొండా శివరాం మిగిలిన పాలకవర్గ సభ్యులకు గాని, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా చెట్లను నరికి, రూ.లక్షల్లో సొమ్ము చేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు వారాలుగా ఎప్పుడు నరికిన చెట్లను అప్పుడే తరలించుకుపోతున్నారని పేర్కొన్నారు. దీంతో శుక్రవారం చెట్లు నరుకుతుండగా మాజీ ఎంపీటీసీ బొండా కళ్యాణ్‌రాజ్, ఉప సర్పంచ్ గొలజాన దుర్గాప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ విరోతి రామారావు, నీటి సంఘం డైరెక్టర్లు లగిశెట్టి సోమునాయుడు, లగిశెట్టి బంగారయ్య, లగిశెట్టి కుమార్, విరోతి అచ్చెంనాయుడు, విరోతి రామ్మూర్తి, లగిశెట్టి పెద అప్పారావు, విరోతి అప్పారావు తదితరులు ఆయకట్టు రైతులతో కలిసి అడ్డుకున్నారు. సుమారు 45 వరకూ నేరేడు చెట్లు, 6 ఎకరాల్లో యూకలిప్టస్ తోటను నరికి అప్పటికే తరలించుకుపోయినట్లు మీడియాకు తెలిపారు. తరలించుకుపోయిన చెట్ల విలువ రూ.20 లక్షల వరకూ ఉంటుందన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని, తహసీల్దార్‌తోపాటు జిల్లా కలెక్టర్‌కూ ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు అందుకున్న ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఘటనా స్థలానికి వచ్చి నరికేసిన చెట్లను పరిశీలించారు. వివరాలు సేకరించారు.

దీనిపై సాగునీటి సంఘం చైర్మన్ సాలాపు సూరిబాబును వివరణ కోరగా 2016లోనే చెట్లను నరికివేసేందుకు ఆక్షన్‌వేసి రూ.2.50 లక్షలు ఇరిగేషన్ శాఖకు చలానా జమ చేసినట్లు తెలిపారు. అప్పట్లో ప్రస్తుత సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు బొండా శివరాం అడ్డుకుని కేసు వేయడంతో చెట్లు తీయడం జరగలేదన్నారు. సంవత్సరం క్రితం కోర్టులో కేసు డిస్మిస్ కావడంతో ప్రస్తుతం చెట్లు తీస్తున్నట్లు పేర్కొన్నారు.

జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి



జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. స్థానిక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త జ్యోతిబా పూలే ఆశయాలు నేటితరం కొనసాగించాలన్నారు. పూలే జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు, అంబేడ్కరిజం పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి రమణబాబు, మళ్ల వేణుబాబు, గుంట్ల అప్పారావు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే ఆదర్శనీయం

ఎస్.రాయవరం: సామాజిక విప్లవకారుల్లో మహాత్మ జ్యోతిబాపూలే ఒకరని ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాలలో జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వెనుకబడిన విద్యార్థులు నాణ్యమైన విద్యనందుకోవాలని ఆయన పేరిట రెసిడెన్షియల్ స్థాయిలో పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. అటువంటి పాఠశాల ఎస్.రాయవరం మండలంలో ఏర్పాటు కావడం ఈ ప్రాంతం విద్యార్థులు చేసుకున్న అదృష్టమన్నారు. ప్రతి విద్యార్థి జ్యోతిబా పూలే ఆశయాలకు అనుగుణంగా నడుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గారా ప్రకాష్, లలితాంబ, కుసుమకుమారి, దీపిక, శోభారాణి, అనిత, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు



చలివేంద్రం ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. బెస్ట్ మార్కెట్, గణేష్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇటువంటి చలివేంద్రాలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చన్నారు. మజ్జిగ చలివేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన నిర్వాహకులు దాడి శ్రీరామమూర్తి, టెక్కలి దేవకీ, దాడి సాంబశివలను అభినందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, ఆడారి కాశీబాబు, అలంక సూర్యప్రకాశరావు, మందపాటి రాము, దాడి గణేష్, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి లక్ష్మణరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, బొడ్డేడ రామునాయుడు, ఆడారి పరశురామ్ పాల్గొన్నారు.

ఫలించిన పయనీర్ కార్మికుల పోరాటం



పయనీర్ కార్మికులతో మాట్లాడుతున్న యాజమాన్యం

అచ్యుతాపురం రూరల్: పయనీర్ పరిశ్రమ కార్మికులు నాలుగు రోజులుగా పోరాడి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకోవడంతో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అభినందనలు తెలిపారు. పయనీర్ కార్మికులకు కనీస వేతనాలు, బోనస్, నైట్ అలవెన్స్ రూ.50 నుంచి రూ.100 వరకూ పెంపు, అటెండెన్స్ అలవెన్స్ రూ.వెయ్యి, ఏటా ఇంక్రిమెంట్, నాలుగు నెలల ఏరియర్స్ ఇవ్వడానికి శుక్రవారం యాజమాన్యం అంగీకరించింది. దాంతో కార్మికులు బి-షిఫ్ట్ నుంచి విధుల్లోకి హాజరయ్యారు.

మారేపల్లి సర్వేయర్ మురళికి ఉత్తమ అవార్డు

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి సచివాలయంలో గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.మురళి ఉత్తమ సర్వేయర్ అవార్డును అందుకున్నారు. జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకరం జీవీఎంసీ సమావేశ మందిరంలో జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఎస్.గోపాలరాజా, రాష్ట్ర సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.చిరంజీవి, అనకాపల్లి డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ సర్వేయర్ అవార్డును అందుకున్న మురళిని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, మండల సర్వేయర్ జి.గోవిందరాజులు, వీఆర్వోలు అభినందించారు.

‘పంతాలకు పోతే సమస్యలు పరిష్కారం కావు’

నాతవరం: ప్రతి చిన్న విషయానికి పంతాలకు పోతే ఎలాంటి సమస్య పరిష్కారం కాదని, కుటుంబాలు ఊహించని విధంగా దెబ్బ తింటాయని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం నిర్వహించారు.. ముందుగా ఫిర్యాదులను పరిశీలించి ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ చేశారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం నిబంధనలు అనుసరించి ఇరువురికి న్యాయం చేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న దానికి, ఫిర్యాదులో ఉన్నదానికి పొంతన లేకుండా కొన్ని ఉన్నాయన్నారు. గ్రామంలో పెద్దలు సమక్షంలో పరిష్కరించుకునే సమస్యలపై సైతం పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లడం వల్ల ఆర్థికంగా నష్టపోతారన్నారు. అధికంగా భూసరిహద్దు, భూమి తాలుకా సమస్యలు ఉన్నాయన్నారు. ఇరు వర్గాలు అర్థం చేసుకుని రాజీకి వస్తే అందరికీ మంచిదన్నారు. ఎస్ఐ సిహెచ్.భీమరాజు, అధికారులు పాల్గొన్నారు.

స్థిరంగా కోనాం జలాశయం నీటి మట్టం

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం నీటి మట్టం ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్థిరంగా కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరగడంతో విడుదలవుతున్న నీటికి జలాశయంలోకి వస్తున్న నీరు సమానంగా ఉండడంతో నీట మట్టంలో తేడాలు రాలేదు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా.. ప్రస్తుతం 95.40 మీటర్ల వద్ద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 60 క్యూసెక్కులుండగా.. అవుట్ ఫ్లో 60 క్యూసెక్కులుగా నమోదు అవుతుంది.

ఈదురు గాలులతో వర్షం

మాడుగుల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ గాలులకు మామిడి కాయలు నేలకొరిగాయి. దీంతో పాటు స్వల్పంగా కురిసిన వర్షానికి ఖరీఫ్ వరి దుక్కులకు రైతులు సిద్ధం అవుతున్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 15 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మహా రాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

ఇ.పి.నెం. 6/2023, ఒ.ఎస్.నెం. 22/2020

బిట్వీన్

కొత్తల మోహనరావు .....పిటీషనరు/ డి.హెచ్.ఆర్.

మరియు

బోనం వరలక్ష్మి మరి ఒకరు

.....రెస్పాండెంట్స్/ జె.డి.ఆర్.

వేలం ప్రకటన

దిగువ వివరింపబడిన షెడ్యూల్ ఆస్తి పై కోర్టు వారిచే పై కోర్టు నందు **తేది: 28-04-2025న ఉదయం గం॥ 10.30ని॥ల నుండి సాయంత్రం 5 గంటల మధ్యలో** బహిరంగ వేలం వేయబడును. కావున ఆసక్తి గలవారు సదరు వేలంలో పాల్గొని సదరు ఆస్తిని వేలంలో పాడుకొనగలరు.

షెడ్యూల్ ఆస్తి వివరములు

ప్రస్తుతం అనకాపల్లి జిల్లా (ఇదివరలో విశాఖపట్నం జిల్లా), అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్, యలమంచిలి సబ్-రిజిస్ట్రార్, అచ్యుతాపురం మండలం, చోడిపల్లి పంచాయతీ, చోడిపల్లి గ్రామంలో ది డైరెక్టర్, టౌన్ మరియు కంట్రీప్లానింగ్, హైదరాబాద్ వారిచే తేది: 16-11-2009న ఎల్.పి.నెం. 61/2009/1, సి.నెంబరు 3820/2008/వి ద్వారా అప్రూవల్ పొందిన ప్లాట్ నెం. 107, ఖాళీ నివేశన స్థలం విస్తీర్ణము 466.66 చదరపు గజాలు, సర్వే నెంబర్లు 228-1, 2,3,4,5,6,7,8, 229-1,2, 230-1,2,3,4,5,6,7,8,9,10,11,12,13, 231-3, 236-1, 237-7, 259 నందు కల స్లాబ్ ఇంటితో కూడిన ఆస్తికి హద్దులు, కొలతలు:

హద్దులు	కొలతలు
తూర్పు: 33 అడుగుల రోడ్డు	తూర్పు: 70 అడుగులు
పడమర: ప్లాట్ నెం. 108	దక్షిణం: 60 అడుగులు
ఉత్తరం: 33 అడుగుల రోడ్డు	పడమర: 70 అడుగులు
దక్షిణం: ప్లాట్ నెం. 106	ఉత్తరం: 60 అడుగులు

పిటీషనర్ విలువ : రూ. 15,00,000/-

అమీన్ విలువ : రూ. 30,00,000/-

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొణతాల శ్రీనివాసరావు, అడ్వకేటు
దాడి భోగలింగం స్ట్రీట్, అనకాపల్లి
సెల్: **95055 22333**
మరియు
వాడపల్లి అన్నపూర్ణయ్య, అడ్వకేటు
యలమంచిలి, సెల్: **92471 59149**